

దూర భారానికి చెక్!

గతంలో కలెక్టరేట్‌కు, ప్రభుత్వ శాఖల సర్కిల్ కార్యాలయాలకు వెళ్లాలంటే 150 కిలో మీటర్లు ప్రయాణించాల్సి వచ్చేది.

వివరాలు 10లో ▸



థర్మల్ ఎనర్జీదే ముఖ్య పాత్ర

ప్రస్తుతం సమాజ అవసరాలకు థర్మల్ ఎనర్జీ ఎంతో ముఖ్య పాత్ర పోషిస్తోందని ప్రొఫెసర్ నుచిటోరి చెప్పారు.

వివరాలు 10లో ▸



బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి

బీఆర్‌ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అన్నారు.

వివరాలు 11లో ▸

న్యూస్‌రీల్

ఓటరుగా నమోదు చేసుకోండి

అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి

సంగారెడ్డి టౌన్: అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదై, ఓటు హక్కును వినియోగించుకోవాలని అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి పిలుపునిచ్చారు. స్వీప్ కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం కలెక్టరేట్‌లో ఓటరు నమోదు, ఓటు వినియోగం, ఓటింగ్ యంత్రాలతో ఓటు వేసే విధానంపై ట్రాన్స్‌జెండర్లకు అవగాహన కల్పించారు. సుమారు 50 మంది ట్రాన్స్‌జెండర్లు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ట్రాన్స్‌జెండర్ ఓటరుగా నమోదు కావాలని కోరారు. మనం వేసే ఓటు మన భవిష్యత్‌ను నిర్దేశిస్తుందని, ఎన్నికల ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా స్వీప్ నోడల్ అధికారి అఖిలేష్ రెడ్డి, డీఆర్‌ఓ నగేష్, డిడబ్ల్యుఓ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆర్‌ఎంగా ప్రభులత



ఆర్టీసీ ఆర్‌ఎంగా బాధ్యతలు స్వీకరించిన ప్రభులత

సంగారెడ్డి టౌన్: ఆర్టీసీ నూతన మెదక్ రీజియన్ మేనేజర్‌గా ప్రభులత శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఆర్‌ఎం సుదర్శన్‌ను రాష్ట్ర కార్యాలయానికి బదిలీ చేశారు. ఖమ్మం ప్రాంతీయ మేనేజర్‌గా పనిచేసిన ప్రభులత ఇక్కడికి వచ్చారు. ఉద్యోగులు, కార్మికుల సహకారంతో ఆర్టీసీని లాభాల బాట పట్టించేందుకు శాయశక్తుల కృషి చేస్తానని ఆర్‌ఎం ఈ సందర్భంగా చెప్పారు.

17న రెజ్లింగ్ పోటీలకు ఎంపిక

నారాయణఖేడ్: ఈనెల 17వ తేదీన జిల్లా స్థాయి రెజ్లింగ్ ఎంపికను నారాయణఖేడ్‌లో నిర్వహించనున్నట్లు పీడీ, రెజ్లింగ్ ఇన్‌చార్జి విఠల్‌నాయక్ తెలిపారు. అండర్ 14, అండర్ 17 బాలబాలికలకు నారాయణఖేడ్ పట్టణంలోని టీటీడబ్ల్యూఆర్‌ఎస్ పాఠశాలలో ఉదయం 9గంటల నుంచి ఈ ఎంపిక ఉంటుందని అన్నారు. సెలక్షన్‌లో పాల్గొనే విద్యార్థులు తమ వెంట ఆధార్‌కార్డు, పాఠశాల బోనఫైడ్, గత సంవత్సరం మార్కుల షీట్, ఐదుపాస్ ఫొటోలు తీసుకుని రావాలని, ఇతర వివరాలకు 8309896289 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ప్రశాంతంగా టెట్ పరీక్షలు



సంగారెడ్డిలో అభ్యర్థుల హాల్ టికెట్లను పరిశీలిస్తున్న సిబ్బంది

సంగారెడ్డి అర్బన్: జిల్లాలో శుక్రవారం ఉపాధ్యాయ అర్హత (టెట్) పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. మొత్తం 99 పరీక్ష కేంద్రాల్లో పేపర్ -1, పేపర్ -2 కలిపి మొత్తం 23,266 అభ్యర్థులకు గాను 20,473 మంది పరీక్షలు రాశారు. మొత్తం రెండు పేపర్లకు కలిపి 2,793 గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. మొదటి, రెండు పేపర్లు ఈజీగానే ఉన్నాయని పలువురు అభ్యర్థులు చెప్పారు.

దరఖాస్తుల ఆహ్వానం



సంగారెడ్డి అర్బన్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఐదు నుంచి తొమ్మిదవ తరగతి వరకు మిగిలిన సీట్ల భర్తీకి మెదక్, సంగారెడ్డి జిల్లాల ఎస్సీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మెదక్ వెస్ట్ రీజియన్ ప్రాంతీయ సమన్వయ అధికారి భీమయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 23న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఇస్నాపూర్‌లో దరఖాస్తు చేసుకోవాలని, అదే రోజు ఎంపిక కూడా ఉంటుందని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

తెరపైకి ఖేడ్ జిల్లా..!

- 24 మండలాలతో ఏర్పాటుకు ఐక్యవేదిక ప్రతిపాదన
- ఎన్నికల వేళ మళ్లీ తెరపైకి వస్తున్న డిమాండ్
- 2018లోనూ కొత్త జిల్లా కోసం ఆందోళనలు



'ఖేడ్' జిల్లాను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్న ఐక్య వేదిక నాయకులు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: వెనుకబడిన ప్రాంతంగా ఉన్న నారాయణఖేడ్ కేంద్రంగా కొత్త జిల్లాను ఏర్పాటు చేయాలనే డిమాండ్ మళ్లీ తెరపైకి వచ్చింది. కొన్ని నెలల్లోనే ఎన్నికలు రానున్న నేపథ్యంలో కొత్త జిల్లా అంశం తెరపైకి రావడం చర్చనీయాంశంగా మారింది. నారాయణఖేడ్ డివిజన్‌లో ఉన్న మండలాలతో పాటు, నారాయణఖేడ్‌కు సమీపంలో ఉండే ఆందోల్ నియోజకవర్గం పరిధిలోని మండలాలు, కామారెడ్డి జిల్లా పరిధిలో ఉన్న సరిహద్దు మండలాలు జుక్కల్, మద్నూర్, పిట్లం, బిచ్కుంద, నిజాంసాగర్ వంటి మండలాలను కలుపుకొని కొత్త జిల్లాగా ఏర్పాటు చేయాలని ప్రతిపాదిస్తున్నారు. మొత్తం 24 మండలాలను కలుపుకొని మంజీరా జిల్లాగా నామకరణం చేయాలని కోరుతున్నారు. మంజీరా జిల్లా సాధన ఐక్యవేదికను ఏర్పాటైంది. పలువురు రిటైర్డ్ ఉద్యోగులతో పాటు, తెలంగాణ జేఏసీలో కీలక పాత్ర పోషించిన నాయకులు, స్థానిక మేధావులు కొందరు ఈ ఐక్యవేదికను ఏర్పాటు చేశారు. ఎన్నికల వేళ ఈ అంశం తెరపైకి వస్తే ప్రభుత్వం స్పందించే అవకాశం ఉందని ఐక్య వేదిక నాయకులు ఒత్తిడి తీసుకొస్తున్నారు.

కొత్త మండలాల ప్రకటన నేపథ్యంలో..

ప్రభుత్వం ఇటీవల కొన్ని కొత్త మండలాలను ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకుంది. నారాయణఖేడ్ పరిధిలో ఉన్న నిజాంపేట్‌ను కొన్ని నెలల క్రితం కొత్త మండలంగా ఏర్పాటు చేయగా, కంగ్టి మండల పరిధిలో ఉన్న తడ్కల్‌ను కూడా తాజాగా కొత్త మండలంగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఖేడ్ జిల్లాను ఏర్పాటు చేయాలనే డిమాండ్ ప్రధానంగా తెరపైకి వస్తోంది.

2018లో ఆందోళనలు

నారాయణఖేడ్ జిల్లాను ఏర్పాటు చేయాలని డిమాండ్ గతం నుంచే ఉంది. ఇందుకోసం 2018లో కూడా కొంత మేరకు నిరసన కార్యక్రమాలు జరిగాయి. స్థానికంగా ఉన్న రాజకీయ పార్టీల నేతల మద్దతు కూడగట్టే ప్రయత్నాలు జరిగాయి. అన్ని పార్టీ ముఖ్యనేతలను కలిసి జిల్లా సాధనకు మద్దతివ్వాలని అప్పట్లో కోరారు. ఇప్పుడు ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో ఈ కొత్త జిల్లా అంశం తెరపైకి రావడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

వెనుకబడిన ప్రాంతం

హైదరాబాద్ దూరంగా ఉన్న నారాయణఖేడ్ మారుమూల ప్రాంతంగా పేరుంది. ఐదారు సంవత్సరాల్లో ఈ ప్రాంతం కొంత మేరకు అభివృద్ధి పనులు జరిగినప్పటికీ.. ఇంకా మారుమూల ఛాయలు పోలేదు. ప్రధానంగా విద్యా, వైద్యం పరంగా ఇంకా అభివృద్ధి జరగలేదని, మౌలిక సదుపాయాల విషయంలో వెనుకబాటు తనమే కనిపిస్తోందని ఐక్య కార్యాచరణ కమిటీ నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నారాయణఖేడ్ జిల్లాగా ఏర్పాటైతే ఈ ప్రాంతం విద్యా, వైద్యం, మౌలిక సదుపాయాలు మెరుగుపడతాయని భావిస్తున్నారు. అలాగే ఏదైనా సమస్యను జిల్లా ఉన్నతాధికారులకు విన్నవించుకునేందుకు జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే ఇక్కడి ప్రజలు అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోందని చెబుతున్నారు. జిల్లా కేంద్రానికి వెళ్లిరావాలంటే సుమారు రెండు వందల కిలోమీటర్లు ప్రయణించాల్సి వస్తుండటం తీవ్ర వ్యయ ప్రయాసలతో కూడుకున్నదని అంటున్నారు. ఖేడ్ జిల్లాను ఏర్పాటు చేస్తే ఈ సమస్యలకు కొంత మేరక పరిష్కారం లభిస్తుందని చెబుతున్నారు.

రేగోడ్ మండలం సంగారెడ్డిలో కలపాలని..

రేగోడ్ మండలం ప్రస్తుతం మెదక్ జిల్లా పరిధిలో ఉంది. ఈ మండలాన్ని సంగారెడ్డి జిల్లాలో విలీనం చేయాలని స్థానికుల నుంచి డిమాండ్ వస్తోంది. స్థానిక యువత తమ మండలాన్ని మార్చాలని నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు.

ప్రజలను ఏకం చేస్తాం



నారాయణఖేడ్‌ను జిల్లా ఏర్పాటు చేయాలని డిమాండ్ గతం నుంచే ఉంది. మళ్లీ ఇప్పుడు ఈ జిల్లా సాధన కోసం కృషి చేస్తున్నాం. కామారెడ్డి జిల్లా పరిధిలో ఉన్న మండలాల్లోనూ పర్యటించాం. ఆయా మండలాల వాసుల అభిప్రాయాలు తీసుకున్నాం. విద్యార్థులను, అన్ని వర్గాల ప్రజలను ఏకం చేసి జిల్లా సాధన కోసం మా వంతు ప్రయత్నాలు చేస్తాం. అలాగే అన్ని పార్టీల రాజకీయ నాయకులను కలిసి జిల్లా ఏర్పాటుకు మద్దతును కూడగట్టే ప్రయత్నం చేస్తాం.

–మల్లయ్య, ఐక్యవేదిక నాయకులు

మట్టి గణపతిని పూజిద్దాం

కలెక్టర్ డాక్టర్ శరత్



గోడపత్రికను ఆవిష్కరించిన కలెక్టర్, తదితరులు

సంగారెడ్డిటౌన్: ప్రతి ఒక్కరూ మట్టి గణపతిని పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలని కలెక్టర్ డాక్టర్ శరత్ పిలుపునిచ్చారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో శుక్రవారం క్యాంపు కార్యాలయంలో గణపతి మట్టి విగ్రహాల వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ముద్రించిన గోడ పత్రికను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రకృతిహితమే పండుగల పరమార్థమన్నారు. ఆయా సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణకు పాటుపడటంతో పాటు ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతను మరచిపోరాదన్నారు. ప్రతి పండుగ వెనుక ఓ మహోన్నత లక్ష్యం దాగి ఉందన్నారు. వినాయక చవితి ఉత్సవాల్లో పర్యావరణ హిత గణపతులకు ప్రాధాన్యమిచ్చి భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, నీరు అందించాలని ఉద్బోధించారు. వివిధ రకాల రసాయనాలతో చేసే విగ్రహాలతో కాలుష్యపు ముప్పు ఏర్పడుతుందని, మట్టి గణపతిని పూజించేలా ప్రతి ఒక్కరూ సంకల్పం తీసుకోవాలన్నారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో మట్టి గణపతులను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అనంతరం పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు అందరికీ మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు గీత తదితరులు పాల్గొన్నారు.

అవకాశం ఇస్తే రుణం తీర్చుకుంటా

సంగారెడ్డి బీఆర్‌ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్



వైకుంఠపురంలో పూజలు నిర్వహిస్తున్న చింతా ప్రభాకర్

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి బీఆర్‌ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్ శుక్రవారం వైకుంఠపురంలో ప్రత్యేక పూజలు, ఫాతేఖాన్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆలయం, దర్గా నిర్వాహకులు సాదర స్వాగతం పలికారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే సంగారెడ్డి ప్రజల రుణం తీర్చుకుంటానని చెప్పారు. నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. పట్టణ శివారులోని శ్రీ వైకుంఠపురం ఆలయం అభివృద్ధికి త్వరలోనే నిధులు కేటాయిస్తామన్నారు. అలాగే.. మంత్రి హరీశ్‌రావు సహకారంతో దర్గా అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. చింతా ప్రభాకర్‌కే తమ మద్దతు ఉంటుందని, ఆయన గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని మైనార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు షేక్ అంజద్ తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, మాజీ సీడీసీ చైర్మన్ విజయేందర్ రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు నక్క నాగరాజు గౌడ్, వెంకటేశ్వర్లు, రాంరెడ్డి, జలేందర్, అలాగే.. గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరి రెడ్డి, వెంకన్న, రాంరెడ్డి, నర్సన్న, మసూద్, రషీద్, హనీస్, అమీర్, సోహెల్, షేక్ సాబేర్ , అజార్ మాలిక్, అజీమ్, యావర్ తదితరులు పాల్గొన్నారు.

డిక్లరేషన్ల పేరిట కాంగ్రెస్ దగా

ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి ధ్వజం



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ నేతలు రోజుకో డిక్లరేషన్ గురించి మాట్లాడుతున్నారని నారాయణఖేడ్ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం సిర్గాపూర్ మండలంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. బోక్కస్‌గాం, సుల్తానాబాద్, పోచాపూర్, సిర్గాపూర్, లక్ష్మణ్‌నాయక్ తండా, తోల్యా తండాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ కమ్యూనిటీ భవనాల నిర్మాణం పనులు ప్రారంభించారు. సిర్గాపూర్‌లో ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాల వేశారు. శివాజీచౌక్ వద్ద జంక్షన్ అభివృద్ధి, రూ.20 లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. పేద ప్రజల అభివృద్ధి, సంక్షేమమం కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. మూడోసారి కూడా బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాఘవరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ గుండు వెంకట్‌రాంలు, రైతు బంధు అధ్యక్షుడు కృష్ణామూర్తి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సంజీవరావు, మాధవనాయుడు, ఎంపీటీసీ శాంతిబాయి, సర్పంచ్‌లు విజయ్‌కుమార్, గంగామణి, నాయకులు శ్రీనివాస్‌రావు, వెంకటేశం పాల్గొన్నారు.

భూ సమస్యలపై ఉద్యమం

రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జంగారెడ్డి



మాట్లాడుతున్న జంగారెడ్డి

కొండాపూర్ (సంగారెడ్డి): రైతుల భూ సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జంగారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రమైన కొండాపూర్‌లోని రైతు వేదిక జిల్లా స్థాయి శిక్షణ తరగతులు జరిగాయి. ఈ సందర్భంగా జంగారెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి సమస్యలు నేటికీ పరిష్కారం కావడం లేదన్నారు. కొండాపూర్, మల్కాపూర్, కుతుబ్ షాహీపేట్, మల్లేపల్లి గ్రామాలలో అనేక భూ సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. మాందాపూర్లో గత ప్రధాని మన్మోహన్ సింగ్ చేతుల మీదుగా అందుకున్న పట్టా సర్టిఫికెట్లకు రైతులు సాగులో ఉన్నప్పటికీ ధరణిలో వారి పేర్లు తొలగించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. సమస్య పరిష్కారానికి రైతులు అధికారుల చుట్టూ తిరగాల్సి వస్తుందన్నారు. తక్షణమే రైతులకు పట్టా పాసుపుస్తకాలు ఇవ్వాలని వెంటనే రైతుబంధు, రైతుబీమా సౌకర్యాలు కల్పించాలని కోరారు. ధరణిలో నెలకొన్న భూ సమస్యలు వెంటనే పరిష్కారం చేయాలన్నారు. లేకుంటే రైతు సంఘం ఆధ్వర్యంలో భూ సమస్యలపై రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు రాజయ్య, కార్యదర్శి నరసింహారెడ్డి, సంఘం జిల్లా నాయకులు యాదవ రెడ్డి, శ్రీనివాస్ మల్లారెడ్డి, అశోక్, మొగులయ్య, శ్రీనివాస్, అమృతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులుగా గుర్తింపు సీఎం కేసీఆర్ చలువే

- మంత్రి హరీశ్ రావు

సిద్దిపేటజోన్: సీఎం కేసీఆర్ మంచి మనస్సుతో ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు తెచ్చారని, భవిష్యత్తులో కూడా అండగా ఉంటామని తనను కలిసిన మజ్దూర్ యూనియన్ నాయకులతో మంత్రి హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో తెలంగాణ మజ్దూర్ యూనియన్ నాయకులు మంత్రిని కలిశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం, కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా అసెంబ్లీలో నిర్ణయం, గవర్నర్ బిల్లుకు ఆమోద ముద్ర వేసిన నేపథ్యంలో వారు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మౌలానా, నాయకులు రవీందర్, దామోదర్, మల్లేశం పాల్గొన్నారు.

పని ఎక్కువ.. జీతం తక్కువ

15 ఏళ్లుగా అరకొర వేతనాలతో వెతలు

- పోరుబాట పట్టిన సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు
- సర్కార్ దిగిరాకుంటే సమ్మె ఉధృతం
- ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్



సంగారెడ్డిలో తలపై కిరీటం పెట్టుకొని నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): స్వరాష్ట్రం వస్తే సమస్యలు తీరుతాయనుకున్న సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగుల ఆశలు అడియాసలు కావడంతో వారు సమ్మె బాట పట్టారు. 15 ఏళ్లుగా కాంట్రాక్టు ఉద్యోగులుగా పనిచేస్తున్నా తమ సర్వీసును రెగ్యులర్ చేయకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలో కాంట్రాక్టు ఉద్యోగులందరిని రెగ్యులరైజ్ చేస్తామన్న ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ అమలుకు నోచుకోలేదు. అన్ని రాజకీయ పక్షాలు, వివిధ ఉద్యోగ సంఘాలు మద్దతు ప్రకటిస్తున్నా.. ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడంత సమ్మె ఉధృతం చేశారు. 11 రోజులుగా వివిధ రూపాల్లో ఉద్యోగులు ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. దీంతో మండల వనరుల కేంద్రాల్లో సేవలు స్తంభించాయి. 2006 నుంచి 2012 వరకు అవసరాలకు అనుగుణంగా విద్యాశాఖ సమగ్ర శిక్షా ఉద్యోగులను నియమించింది. కాంట్రాక్టు పద్ధతిలో ఏపీవోలు, సిస్టమ్ అనలిస్టులు, టెక్నికల్ పర్సన్లు, ఎంట్రీ ఆపరేటర్లు, బీఎల్ ఎంపీలు, అటెండర్లను డీఈవో కార్యాలయ స్థాయిలో నియమించారు. మండల స్థాయిలో భవిత కేంద్రం నిర్వహణకు ఇన్క్లూజివ్ ఎడ్యుకేషనల్ రిసోర్సుపర్సన్లు, ఎంఆర్సీలు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు, మిస్ కోఆర్డినేటర్లు, మెసెంజర్లు, క్లస్టర్ రిసోర్సుపర్సన్లు ఇలా అవసరం మేరకు కాంట్రాక్టు పద్ధతిలో నియమించారు. జిల్లాలో మొత్తం 732 మందిని వివిధ హోదాల్లో నియమించి సమగ్ర శిక్షా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు.

విద్యాశాఖలో వీరే కీలకం

పాఠశాల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు విద్యాశాఖలో సమగ్ర శిక్షా ఉద్యోగుల పాత్ర కీలకం. రోజువారీ కార్యకలాపాల్లో వీరు లేకుండా ఏ ఒక్క పని కూడా ముందుకు సాగదు. జిల్లా స్థాయిలో అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్లు, సిస్టం అనలిస్ట్, డాటా ఎంట్రీ ఆపరేటర్లు, మెసెంజర్లు, మండల విద్యాశాఖలో ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, కాంప్లెక్స్ పరిధిలో క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు వివిధ విభాగాల్లో పని చేస్తున్నారు. వీరికి సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని గతంలో అత్యున్నత న్యాయ స్థానం ఆదేశించినా అమలుకు నోచుకోవడంలేదు. సీఎం హామీ అతీగతీలేదు. కాగా, ఆంధ్రప్రదేశ్‌లో సుమారు రూ.30,500 నెల వేతనం తీసుకుంటూ సమగ్ర శిక్షా ఉద్యోగులు పనిచేస్తుంటే తెలంగాణలో మాత్రం రూ.19,500 లోపు వేతనాలకు పనిచేయాల్సి వస్తోందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒడిశా, హర్యానా, ఢిల్లీ, మహారాష్ట్ర, మరి కొన్ని రాష్ట్రాల్లో ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరించగా.. ఆంధ్రప్రదేశ్‌లో మినిమం టైం స్కేల్ అమలు చేస్తున్నారు. తెలంగాణలో మాత్రం ఉద్యోగభద్రత లేకుండా, చాలీచాలనీ వేతనాలతో పనిచేయాల్సి వస్తోందని వారు వాపోతున్నారు.

డిమాండ్లను నెరవేర్చాలి

సమగ్ర శిక్షా ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని, అప్పటి వరకు కనీస వేతన స్కేలును అమలు చేయాలని సమగ్ర శిక్షా ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు, ఉద్యోగభద్రత కల్పిస్తూ ప్రతి ఉద్యోగికి పది లక్షల జీవిత బీమా, ఐదు లక్షల ఆరోగ్యబీమా సౌకర్యం కల్పించాలన్నారు. విద్యాశాఖ నియామకాల్లో తమకు వేయిటేజీ కల్పించాలని కోరుతున్నారు. సుప్రీంకోర్టు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని తీర్పు చెప్పినా, పీఆర్సీ కమిటీ ప్రతి కాంట్రాక్టు ఉద్యోగికి ఉద్యోగి హోదాను బట్టి ప్రభుత్వం ఉద్యోగికి చెల్లించే మూల వేతనం, కనీస వేతన స్కేలు, అమలు చేయాలని సూచించినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, వెంటనే ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

విద్యాశాఖలో విలీనం చేయాలి



ప్రభుత్వం సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగులందరినీ విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులరైజ్ చేయాలి. అప్పటివరకు మినిమం టైం స్కేలు అమలు చేయాలి. విధి నిర్వహణలో చనిపోయిన వారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి.

– శేషాద్రి, సంఘం జేఏసీ జిల్లా అధ్యక్షుడు

రెగ్యులరైజ్ చేయాలి



దశాబ్దన్నర నుంచి పని చేస్తున్న తమను వెంటనే రెగ్యులరైజ్ చేయాలి. ఉద్యోగులకు కనీస వేతనం అమలు చేయాలి. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా సౌకర్యాలు కల్పించాలి. ఇతర శాఖల్లోని ఉద్యోగులకు ఇటీవల ప్రభుత్వం న్యాయం చేసింది. మాకూ చేయాలి.

– నిరంజన్ చారి, సీఆర్పీ సదాశివపేట

ఉద్యోగ భద్రత కల్పించాలి



సమగ్ర శిక్షా ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలి. మహిళ ఉద్యోగుల ప్రసూతి సెలవులు మంజూరు చేయాలి. సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి.

– రాజేశ్వర్, ఎస్ఎస్ఏ సంఘం నాయకుడు

చిరుధాన్యాలలో అపార పోషక విలువలు

వర్గల్(గజ్వేల్): అపార పోషక విలువలు కలిగిన చిరుధాన్యాలు, గుడ్లు తీసుకోవడం ద్వారా బాలింతలు, తల్లులు, కిశోర బాలికలు ఆరోగ్యవంతంగా ఎదగాలని సీడీపీఓ వెంకటరాజమ్మ అన్నారు. శుక్రవారం వర్గల్ లో నిర్వహించిన పోషణ అభియాన్ కార్యక్రమంలో ఎంపీపీ లతా రమేష్ గౌడ్, జెడ్పీటీసీ బాలు యాదవ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాణి, అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటరాజమ్మ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికల్లో రక్తహీనత నివారించేందుకు మిల్లెట్స్ చిరుధాన్యాలు క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. చిన్నారులు చక్కగా ఎదిగేందుకు బాలామృతం ప్లస్ అందిస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా పోషకాలతో కూడిన ఆహార పదార్థాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. పోషణ అభియాన్ ప్రతిజ్ఞ చేశారు.

క్లుప్తంగా

వినూత్న పథకాలకు కేరాఫ్ అడ్రస్ తెలంగాణ
జార్ఖండ్ డిప్యూటీ కలెక్టర్‌ల కితాబు


ఎర్రవల్లి రైతు వేదికలో అధికారుల బృందం

మర్కూక్(గజ్వేల్): వినూత్న పథకాలకు తెలంగాణ చిరునామా అని జార్ఖండ్ డిప్యూటీ కలెక్టర్‌లు కొనియాడారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలంలో పర్యటించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఆసరా, మిషన్ భగీరథ, కాకతీయ, బీసీ బంధు, దళిత బంధు, పల్లెప్రగతి, గృహలక్ష్మి, ఈజీఎస్ కార్యక్రమాలు, తదితర పథకాలు గురించి అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో పథకాల అమలు తీరు బాగుందని వారు కితాబు ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీడీ కౌసల్యదేవి, ఎంపీడీఓ ప్రవీణ్, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

శాంపిల్స్ సేకరణకు వచ్చి.. మంటలు అంటుకొని ల్యాబ్‌టెక్నీషియన్ మృతి

పటాన్‌చెరు టౌన్ : శాంపిల్స్ కలెక్షన్ల కోసం వచ్చిన ల్యాబ్‌టెక్నీషియన్ మంటలు అంటుకొని మృతిచెందింది. ఈ సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ మల్లయ్య కథనం ప్రకారం... లింగమయ్య కాలనీకి చెందిన ఫాతిమా(28) చందానగర్ టిస్లా ల్యాబ్‌లో పనిచేస్తుంది. ఈనెల 13న బీరంగూడ పెట్రోల్ బంక్ సమీపంలో ఉన్న టెస్టుల స్టోర్‌కు శాంపిల్స్ కలెక్షన్ చేసుకోవడానికి రాగా దుస్తులపై ఐఫో క్లోరైడ్ సొల్యూషన్ పడింది. శుభ్రం చేసుకోవడానికి వెళ్తుండగా దేవుడి చిత్రపటం ముందు వెలిగించిన దీపం పడి మంటలు అంటుకున్నాయి. దీంతో ఆమె కాలిపోయింది. కాగా, ప్రాథమిక చికిత్స అనంతరం ఉస్మానియాకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతిచెందింది. కేసును పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


బాబు

రామాయంపేట(మెదక్): విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని సుతారిపల్లిలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ రంజిత్ కథనం మేరకు... గ్రామానికి చెందిన రైతు మద్దూరి బాబు (39) పొలానికి నీరు పారించి వస్తానని ఇంట్లో చెప్పి గురువారం రాత్రి వెళ్లి రాలేదు. మరుసటి రోజు ఉదయం అతడి కుటుంబ సభ్యులు పంటచేను వద్దకు వెళ్లి చూస్తే స్టార్టర్ బాక్స్ వద్ద కరెంట్ షాక్ గురైన బాబు మృతిచెంది కనిపించింది. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసును పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

భార్య కాపురానికి రావడం లేదని..

సిద్దిపేటరూరల్: భార్య కాపురానికి రావడం లేదని తీవ్ర మనస్తాపానికి గురైన వ్యక్తి ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన నారాయణరావుపేట మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... మండల కేంద్రానికి చెందిన బోదాసు రవి (34), స్వప్న భార్యాభర్తలు. కొంతకాలంగా వీరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టి సర్ది చెప్పారు. 15 రోజుల కిత్రం మరలా ఘర్షణ పడగా ఇద్దరి పిల్లలను తీసుకుని ఆమె పుట్టినిల్లయిన నార్లాపూర్‌కు వెళ్లి పోయింది. ఎంతకీ ఇంటికి రాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన అతడు శుక్రవారం ఇంట్లో ఉదయం 7 గంటలకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దూరాభారానికి చెక్!

- సర్కిల్ కార్యాలయాలకు కేంద్రంగా సిద్దిపేట
- ఇప్పటికే విద్యుత్, ఆర్ అండ్ బీ, ఇరిగేషన్ ఎస్ఈ, సీసీఎఫ్ ఆఫీస్‌లు
- ఇటీవల పంచాయతీ రాజ్ ఎస్ఈ కార్యాలయాన్ని ప్రారంభించిన మంత్రి హరీశ్ రావు


పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ ఎస్ఈ కార్యాలయం

సాక్షి, సిద్దిపేట : గతంలో కలెక్టరేట్‌కు, ప్రభుత్వ శాఖల సర్కిల్ కార్యాలయాలకు వెళ్లాలంటే 150 కిలో మీటర్లు ప్రయాణించాల్సి వచ్చేది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కావడంతో.. జిల్లా ఏర్పాటు, తర్వాత ఆయా శాఖల సర్కిల్ కార్యాలయాలు సిద్దిపేటలో ఏర్పాటవుతున్నాయి. ఇప్పటికే విద్యుత్ శాఖ, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ, ఎస్ఈ కార్యాలయాలు, చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ కార్యాలయం(సీసీఎఫ్) సేవలు ప్రజలకు అందుతున్నాయి. మంత్రి హరీశ్‌రావు చొరవతో జిల్లాకు ఒక్కొక్కటిగా ప్రధాన కార్యాలయాలు పట్టణానికి వస్తున్నాయి. సోమవారం పంచాయతీరాజ్ ఇంజినీరింగ్(పీఆర్) ఎస్ఈ కార్యాలయం సైతం అందుబాటులోకి వచ్చింది. దీంతో జిల్లాలో అభివృద్ధి పనులు మరింత వేగంగా, నాణ్యతతో జరగనున్నాయి.

రూ.50లక్షల పనుల వరకు టెక్నికల్ మంజూరు ఇక్కడే

పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్(పీఆర్) ఆధ్వర్యంలో జరిగే అభివృద్ధి పనుల మంజూరు, అగ్రిమెంట్‌లు ఇక పట్టణంలోనే జరగనున్నాయి. జిల్లాలో ప్రస్తుతం ఈఈ కార్యాలయం ఉంది. వీరికి రూ.10 లక్షల వరకే టెక్నికల్‌గా మంజూరు చేసే అధికారం ఉంటుంది. ఈ కార్యాలయం మంజూరు కావడంతో ఏదైనా అభివృద్ధి పనికి సంబంధించి రూ.50లక్షల వరకు టెక్నికల్‌గా మంజూరు చేసే అధికారం ఉంటుంది. ప్రతి పనికీ సంబంధించిన టెండర్ల అగ్రిమెంట్‌లు ఎస్ఈ పరిధిలో ఇక్కడే జరగనున్నాయి. త్వరలో పనుల మంజూరు విలువను మరింత పెంచే అవకాశం ఉంటుంది. రూ.10 లక్షల కంటే ఎక్కువ మంజూరు కోసం మెదక్ వెళ్లాల్సి వచ్చేది. దీంతో కొంత ఆలస్యం అయ్యేది. జిల్లాకు ఎస్ఈ కార్యాలయం మంజూరు కావడంతో పనులు మరింత వేగంగా జరగనున్నాయి.

పీఆర్ పునర్‌వ్యవస్థీకరణ

ఇటీవల పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ పునర్‌వ్యవస్థీకరణ చేశారు. అందులో భాగంగా సిద్దిపేటకు ఎస్ఈ కార్యాలయం మంజూరు చేశారు. అప్పటికే ఇక్కడ ఈఈ కార్యాలయం ఉంది. అయినా గజ్వేల్‌కు మరో ఈఈ కార్యాలయం మంజూరు చేయడంతో రెండుకు చేరాయి. జిల్లాలో సబ్ డివిజన్ కార్యాలయాలు సిద్దిపేట, దుబ్బాక, హుస్నాబాద్, చేర్యాల, గజ్వేల్, వర్గల్ ఉండగా చిన్నకోడూరు, తొగుటకు సబ్ డివిజన్ కార్యాలయాలు, అలాగే సిద్దిపేట, గజ్వేల్‌లకు క్యూసీ కార్యాలయాలు మంజూరయ్యాయి. జిల్లాలో 26 మండలాల్లో పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ శాఖకు సంబంధించినవి 1,019 రోడ్లుండగా 2,654 కిలో మీటర్లు ఉన్నాయి. అందులో బీటీ రోడ్లు 1,358 కిలో మీటర్లు, సీసీలు 167, మట్టి రోడ్లు 975, మెటల్ రోడ్లు 154 కిలోమీటర్లున్నాయి.

అభివృద్ధి పనుల్లో మరింత వేగం

జిల్లాలో ఎస్ఈ కార్యాలయం ఏర్పాటు కావడంతో అభివృద్ధి పనుల్లో మరింత వేగం పెరగనుంది. ఈ స్థాయిలో రూ. 50 లక్షల వర్క్ వరకు అగ్రిమెంట్ ఇక్కడే చేయవచ్చు. టెక్నికల్ మంజూరు సైతం ఇక్కడే ఇవ్వవచ్చు. అలాగే క్వాలిటీ కంట్రోల్ కార్యాలయం సైతం ఏర్పాటు అవడంతో జరుగుతున్న పనుల పై మరింత నిఘా ఉండనుంది. పీఆర్ పునర్ వ్యవస్థీకరణతో జిల్లాకు ఎంతో మేలు కలిగింది.

–శ్రీనివాసరావు, ఈఈ, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్

జిల్లాస్థాయి క్రీడాకారుల ఎంపిక


జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

మిరుదొడ్డి(దుబ్బాక): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన మండల స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను గుర్తించి జిల్లాస్థాయి క్రీడలకు ఎంపిక చేసినట్లు స్కూల్ కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ కొత్త రాజిరెడ్డి శుక్రవారం తెలిపారు. విభాగాలవారీగా ఎంపికైన క్రీడాకారుల వివరాలు..

- అండర్– 14 కబడ్డీ బాలుర విభాగంలో.. చెప్యాలకు చెందిన రేవంత్, అందెకు చెందిన జీవన్, మిరుదొడ్డికి చెందిన రవీంద్ర, వినయ్, టీఎస్ డబ్ల్యూఆర్ఎస్ అల్వాలకు చెందిన రాంసింగ్, నిఖిల్, అభిరాం, ప్రశాంత్. అండర్ –17 కబడ్డీలో చెప్యాలకు చెందిన ప్రవీణ్, రాంచరణ్, అందెకు చెందిన విశాల్, మిరుదొడ్డికి చెందిన తేజ, బుద్ధవర్మ, జశ్వంత్, టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ అల్వాలకు చెందిన నితిన్, సురేశ్.
- వాలీబాల్ అండర్– 14 బాలుర విభాగంలో.. మిరుదొడ్డికి చెందిన రామ్‌చరణ్, అభిరామ్ విజయభాస్కర్, టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ అల్వాలకు చెందిన నితిన్, మహేష్, అభిరాం, టీఎస్ఎంఎస్‌కు చెందిన సంపత్. అండర్ –17 విభాగంలో మిరుదొడ్డికి చెందిన భరత్, ప్రమోద్, సాయి చరణ్, టీఎస్ఎంఎస్‌కు మిరుదొడ్డికి చెందిన సాయి తేజ, అను చరణ్, టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ అల్వాలకు చెందిన విష్ణువర్ధన్, జశ్వంత్, కార్తీక్.
- వాలీబాల్ అండర్– 14 బాలికల విభాగంలో.. మిరుదొడ్డికి చెందిన పావని, వైశాలి, సాత్విక, కీర్తన, అస్మిత, భానుశ్రీ. అండర్ –17 విభాగంలో మిరుదొడ్డికి చెందిన స్వాతి, శృతి, సానియా, శ్రీజ, మధుమిత, టీఎస్ఎంఎస్ మిరుదొడ్డికి చెందిన మనీషా, చెప్యాలకు చెందిన శ్రావణి ఎంపికైనట్లు ఆయన తెలిపారు. జిల్లా స్థాయిలో జరిగే క్రీడల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

థర్మల్ ఎనర్జీదే ముఖ్య పాత్ర


కార్యక్రమంలో కాలేజీ ప్రతినిధులు తదితరులు

నర్సాపూర్ : ప్రస్తుతం సమాజ అవసరాలకు థర్మల్ ఎనర్జీ ఎంతో ముఖ్య పాత్ర పోషిస్తోందని జపాన్ దేశంలోని కుమమాటో యూనివర్సిటీ ప్రొఫెసర్ సుచిటోరి చెప్పారు. శుక్రవారం నుంచి స్థానిక బీవీ రాజు ఇంజినీరింగ్ కాలేజీలో అంతర్జాతీయ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంను ప్రిన్సిపాల్ డాక్టర్ సంజయ్‌దూబె ప్రారంభించారు. కార్యక్రమంలో సుచిటోరి మాట్లాడుతూ థర్మల్ ఎనర్జీ ఉత్పత్తి, పంపిణీ, స్టోరేజీ, దాని అవసరాలను వివరించారు. జపాన్, మన దేశం అనుసరిస్తున్న పద్ధతులను వివరించారు. కాలేజీ ప్రిన్సిపాల్ దూబె మాట్లాడుతూ ఎమర్జింగ్ టెక్నాలజీస్ ఇన్ థర్మల్ ఎనర్జీ ప్రొడక్షన్ అండ్ స్టోరేజీపై కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో విశిష్ట అతిథి బిట్స్ పిలానీ హైదరాబాద్‌కు చెందిన ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ థర్మల్ ఎనర్జీ ఉత్పత్తి, నిర్వహణ నిల్వల సామర్థ్యంపై పరిశోధనలను వివరించారు. ఈ సదస్సులో దేశంలోని ఆయా కాలేజీలకు చెందిన ప్రొఫెసర్లు పాల్గొంటారని కాలేజీ డైరెక్టర్ డాక్టర్ లక్ష్మీప్రసాద్ తెలిపారు. సదస్సును మెకానికల్, కెమికల్ బ్రాంచ్‌లు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయని వివరించారు. మెకానికల్ బ్రాంచ్ హెచ్ఓడీ వరుణ్, కెమికల్ ఇంజినీరింగ్ బ్రాంచ్ హెచ్ఓడీ మురళీకృష్ణ, వేదిక డీన్ రాజు, ఏఓ , ఏఏఓ పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య


లక్ష్మి

పాపన్నపేట(మెదక్): మానసిక పరిస్థితి బాగా లేని మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన పాపన్నపేటలో జరిగింది. ఎస్సై మహిపాల్‌రెడ్డి కథనం ప్రకారం.. చీకోడ్‌కు చెందిన మన్నె లక్ష్మి (55) భర్త నారాయణ రెండేళ్ల క్రితం మరణించాడు. అప్పటి నుంచి మానసిక రోగిలా ప్రవర్తించేది. ఈనెల 14న పాపన్న చౌరస్తాలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. గమనించిన ఆటో డ్రైవర్‌లు పోలీసులకు సమాచారం అందించారు. కాగా 108లో మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించగా, చికిత్సపొందుతూ గురువారం రాత్రి మరణించింది. మృతు రాలి కుమార్తె నాగరాణి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

పనిముట్ల సృష్టికర్త విశ్వకర్మ

గజ్వేల్‌రూరల్: పనిముట్ల సృష్టికర్త విశ్వకర్మ అని ఆర్‌బీఎల్ బీఎంఎస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీశైలం, వర్కింగ్ ప్రెసిడెంట్ సల్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. బీఎంఎస్ కార్యాలయంలో వారు మాట్లాడారు. ఈనెల 17న ఆయన జయంతి సందర్భంగా ప్రజలు ఆరోజు జాతీయ కార్మిక దినోత్సవంగా జరుపుకోవాలన్నారు.

'దళిత బంధు' పేరుతో చిచ్చు

దుబ్బాకరూరల్: 'దళిత బంధు' పేరుతో ప్రభుత్వం దళితుల్లో చిచ్చు పెడుతోందని ఆరోపిస్తూ డీబీఎఫ్, రాష్ట్రీయ మూల్ నివాస్ సింగ్ ఆధ్వర్యంలో సామాజిక పరివర్తన నేతలు శంకర్, కుమార్ చేపట్టిన పాదయాత్ర శుక్రవారం నాటికి ఆరో రోజుకు చేరుకుంది. మండలంలోని గోసానిపల్లి, గంభీర్‌పూర్, పోతారం, చీకోడ్, రామక్కపేట, లచ్చపేట, దుబ్బాక వరకు పాదయాత్ర చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రతి దళిత కుటుంబానికి దళిత బంధు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఒక్క కుటుంబానికి వర్తింపజేయాల్సిన పథకాన్ని రెండు, మూడు కుటుంబాలకు ఇవ్వాలని చూస్తోందన్నారు. దీంతో గొడవలు జరిగి కేసులు పెట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో దళిత నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నలుగురికి గాయాలు

లారీడ్రైవర్ సడన్ బ్రేక్ వేయగా.. వెనుక నుంచి ఢీకొట్టిన ఆటో


చికిత్స పొందుతున్న రబియా బేగం


ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అబ్రహం

పటాన్‌చెరు టౌన్: లారీ సడన్ బ్రేక్ వేయగా వెనుక వస్తోన్న ఆటో ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆటో డ్రైవర్‌తో సహా నలుగురు తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన మండల పరిధిలోని ఇస్నాపూర్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం... సంగారెడ్డి నుంచి పటాన్‌చెరు వెపునకు వస్తున్న ఆటో ఇస్నాపూర్ సమీపంలో ప్రమాదానికి గురైంది. లారీ డ్రైవర్ అకస్మాత్తుగా సడన్ బ్రేక్ వేయగా వెనుక వస్తోన్న ఆటో ముందున్న వెహికల్‌ను ఢీ కొట్టింది. దీంతో ఆటో డ్రైవర్ రవీందర్, సహా ఠాగూర్, అబ్రహం, రబియా బేగంకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను ముందుగా పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి ఆటో డ్రైవర్‌ను సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మిగతా ఇద్దరు క్షతగాత్రులను గాంధీకి, ఇస్నాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అబ్రహం పటాన్ చెరు ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్నాడు.

టెట్ రాయడానికి వెళ్తూ..

ఎదురెదురుగా బైక్‌లు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు


క్షతగాత్రుడు నాగరాజు

తొగుట(దుబ్బాక): ఎదురెదురుగా బైక్‌లు ఢీకొన్న సంఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన తొగుట మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు .. దౌల్తాబాద్ మండల కేంద్రానికి చెందిన నాగరాజు, మిత్రుడు చందుతో కలిసి టెట్ పరీక్ష రాయడానికి ద్విచక్ర వాహనంపై సిద్దిపేట వెళ్తున్నారు. అలాగే తుక్కాపూర్ వాసి మోహిన్ కూడా బైక్ పై తొగుటకు వస్తున్నాడు. వీరిద్దరి వాహనాలు తుక్కాపూర్ శివారులో మలుపు వద్ద ఢీకొన్నాయి. దీంతో ఇరువురు తీవ్రంగా గాయపడ్డారు. పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు వారి బంధువులు తరలించారు. అయితే ప్రమాదం జరిగిందన్న సమాచారంతో వెంటనే ఘటనా స్థలికి తొగుట ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు సాయికుమార్ చేరుకున్నారు. గ్రామస్తులు 108కు సమాచారం అందించగా, సమయం పడుతుందని గ్రహించి తన కారులో క్షతగాత్రులను సిద్దిపేట ఆస్పత్రికి తరలించారు.

పోగొట్టుకున్న రూ.5.80 లక్షలు బాధితుడి చెంతకు..


బాధితుడికి నగదును అప్పగిస్తున్న సీఐ తదితరులు

జహీరాబాద్: బ్యాంక్ నుంచి నగదు తీసుకుని వెళుతూ మార్గమధ్యలో పోగొట్టుకున్నాడు. శుక్రవారం బాధితుడికి పోలీసులు తిరిగి ఆ మొత్తాన్ని అప్పగించారు. సీఐ బి.రాజు, ఎస్ఐ శ్రీకాంత్ కథనం ప్రకారం.. పట్టణంలోని మూసానగర్ కాలనీకి చెందిన రిటైర్డ్ ఉద్యోగి గులాం అహ్మద్ ఈనెల 13న అవసరం నిమిత్తం బంగారు ఆభరణాలు బ్యాంక్ ఆఫ్ బరోడా బ్యాంకులో తనఖా పెట్టి రూ.5.80లక్షలను తీసుకున్నాడు. సొమ్మును ప్లాస్టిక్ కవర్లో పెట్టుకుని బైక్ హుక్‌కు తగిలించాడు. అక్కడి నుంచి భవానీ మందిర్ క్రాస్ రోడ్డు వద్ద పాన్‌షాప్ ముందు ఆగి పాన్ తీసుకుని ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యంలో గంజ్‌లోకి వెళ్లి వెనుక చూసుకునే సరికి బ్యాగ్ చినిగిపోయి ఉంది అందులోని సొమ్ము కనిపించలేదు. దీంతో వచ్చిన మార్గంలో వెతుక్కుంటూ వెళ్లాడు. అయినా ఆచూకీ దొరకలేదు. ఈ విషయమై అదేరోజు రాత్రి 9 గంటల ప్రాంతంలో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణలో సీసీ కెమెరాలను పరిశీలించారు. ఆ సమయంలో వాహనంపై వెళ్లిన వ్యక్తి ఎవరనేది ఆరా తీశారు. పుటేజీలో డబ్బు దొరికిన వ్యక్తి పట్టణానికి చెందిన నిస్సార్‌గా గుర్తించారు. ఇంటికెళ్లి విచారించగా వాస్తవమేనని జాగ్రత్తగా దాచి ఉంచానని చెప్పి పోలీసులకు అప్పగించాడు. కేసును చేధించిన హెడ్ కానిస్టేబుళ్లు ఎం.జైపాల్‌రెడ్డి, శ్రీనివాస్, కానిస్టేబుల్ అస్లాంలను సీఐ అభినందించి క్యాష్ అవార్డులను అందజేశారు.

ఇంటిముందే కబళించిన మృత్యువు


రాచకొండ శంకరయ్య

హుస్నాబాద్‌రూరల్: ఇంటి ముందు నిలబడ్డ వ్యక్తిని బైక్ ఢీకొనగా మృతిచెందిన సంఘటన మండలంలోని మహ్మదాపూర్‌లో జరిగింది. ఎస్‌ఐ మహేశ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఆకుల కుమార్ (40) పదమూడు రోజుల కిందట ఇంటి ముందు నిలబడగా బైక్ ఢీకొంది. దీంతో తల, వెన్నెముకకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే కరీంనగర్ ఆస్పత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. శుక్రవారం ఉదయం పరిస్థితి విషమించి మృతిచెందాడు. మృతుడి భార్య సరిత, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు మహేశ్ తెలిపారు.

మెట్లపై నుంచి జారి పడి.. అనంతలోకాలకు..

కొండపాక(గజ్వేల్): ప్రమాదవశాత్తు మెట్లపై నుంచి జారిపడి వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన కుకునూరుపల్లి మండలంలోని లకుడారంలో జరిగింది. ఎస్సై పుష్పరాజ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రాచకొండ శంకరయ్య(48) నూతన ఇంటి నిర్మాణానికి నీళ్లు పడుతుండగా ఈనెల 7న ఉదయం మెట్లపై నుంచి జారి కింద పడ్డాడు. వెంటనే అతడిని గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం లక్ష్మక్కపల్లిలోని ఆర్వీఎం హాస్పిటల్‌లో చేర్పించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఈనెల 10న గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పుష్పరాజ్ పేర్కొన్నారు.

రెండు వైన్‌షాపులపై కేసు నమోదు

రిపోర్టు రాగానే చర్యలు : డీటీఎఫ్ సీఐ నరేందర్


శాంపిల్స్ సేకరించిన వైన్‌షాప్ ఇదే

పాపన్నపేట (మెదక్): మద్యం కల్తీ జరుగుతున్నట్లు వచ్చిన ఆరోపణల రీత్యా పాపన్నపేట మండలం పరిధిలో రెండు వైన్‌షాపులపై ఎక్సైజ్ అధికారులు శుక్రవారం కేసు నమోదు చేశారు. డీటీఎఫ్(జిల్లా టాస్క్‌ఫోర్స్) సీఐ నరేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏడుపాయల కమాన్ వద్ద, చిత్రియాల్ వద్ద ఉన్న మద్యం షాపుల్లో కల్తీ అమ్మకాలు కొనసాగుతున్నట్లు టాస్క్‌ఫోర్స్‌కు ఫిర్యాదు అందింది. ఈ వైన్‌షాపుల్లో షాంపిల్స్ సేకరించి అధికారులు ల్యాబ్‌కు పంపించారు. ఈ దుకాణాలపై కేసులు నమోదు చేశామని, రిపోర్ట్ రాగానే చర్యలు తీసుకుంటామని సీఐ పేర్కొన్నారు. గతంలోనూ వీటిపై కేసులు నమోదయ్యాయి.

అజంతా ఎక్స్‌ప్రెస్ ఎక్కేందుకు అగచాట్లు


పట్టాలు దాటి ఎక్స్‌ప్రెస్ ఎక్కుతున్న ప్రయాణికులు

చేగుంట(తూప్రాన్): మండలంలోని వడియారం రైల్వే స్టేషన్ మూడోలైన్ రైలు పట్టాలపై శుక్రవారం అంజంతా ఎక్స్‌ప్రెస్ నిలపడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. నిజామాబాద్ వైపు నుంచి సికింద్రాబాద్ వెళ్లే ఈ ఎక్స్‌ప్రెస్ ఉదయం 7.30 నిమిషాలకు స్టేషన్‌కు చేరుకుంది. స్టేషన్ మాస్టర్ 1వ నంబర్ ప్లాట్‌ఫాంపై ప్యాసింజర్ రైలుకు, రెండో లైన్‌పై గూడ్స్‌రైలుకు, మూడో లైన్‌లో దీనిని నిలిపేందుకు అవకాశం కల్పించాడు. దీంతో ఎక్కేందుకు పట్టాలు దాటుకుంటూ వెళ్లేందుకు వృద్ధులు, మహిళలు వారి పిల్లలతో ఇబ్బందులు పడ్డారు. నాలుగు నెలల క్రితం ఇదే జరుగగా ప్రయాణికులు స్టేషన్‌లో ధర్నా నిర్వహించారు. రైళ్ల నిలిపే విషయమై స్టేషన్ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారని పలువురు ప్యాసింజర్స్ పేర్కొంటున్నారు.

శభాష్ శంకరయ్య

- మట్టి విగ్రహాల తయారీ పనితనంతో అధికారుల మెప్పు
- మూడేళ్లుగా మెదక్ కలెక్టరేట్ నుంచి ఆర్డర్లు

గణేశుడి మట్టి విగ్రహాలను తయారు చేస్తూ అందరి మన్ననలు పొందుతున్నాడు. పర్యావరణ పరిరక్షణకు తన వంతుగా కృషి చేస్తున్నాడు. అంతేనా కలెక్టరేట్‌లో విగ్రహాల ప్రదర్శన గావించి ఏకంగా మూడేళ్ల నుంచి ఆర్డర్లు పొందుతున్నాడు. అతనే మండలంలోని పైతర గ్రామానికి చెందిన కుమ్మరి శంకరయ్య.

కొల్చారం(నర్సాపూర్):


పైతరకు పక్కనున్న గ్రామ చెరువుల నుంచి మట్టిని తీసుకువచ్చి వినాయక విగ్రహాలను తయారు చేస్తూ గ్రామంలో విక్రయిస్తున్న శంకరయ్య పనితనాన్ని గమనించిన కొంతమంది జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లాలంటూ ప్రోత్సహించారు. దీంతో తాను తయారు చేసిన వాటిని కలెక్టర్ కార్యాలయంలో ప్రదర్శించడంతో సంతృప్తి చెందిన అధికారులు, కులవృత్తులను ప్రోత్సహించాలనే లక్ష్యంగా అతడికి తయారీ ఆర్డర్‌ను మూడేళ్ల నుంచి ఇస్తూ ఆర్థికంగా సహకారం అందిస్తున్నారు. దీంతో వినాయక చవితి వస్తుందంటూనే ఇంటిల్లిపాది మట్టి విగ్రహాల తయారీలో నిమగ్నమై పోవడం కనిపిస్తున్నది.కాగా ఈనెల 18న వినాయక చవితి పండగా ఉంది.


విగ్రహాల తయారీలో శంకరయ్య కుటుంబం

నష్టం లేదు

పర్యావరణానికి మట్టి విగ్రహాల వల్ల నష్టం లేదు. దీంతో చెరువు పక్కన ఉన్న ప్రదేశాల్లో వీటిని నిమజ్జనం చేయడం ద్వారా పూజ కోసం ఉపయోగించిన వివిధ రకాల చెట్ల గింజలు భూమిపై పడి వృక్షాలు పెరిగే అవకాశం కూడా ఎక్కువగా ఉంటుంది. – పర్యావరణ వేత్తలు

మంచి ఆదరణ వచ్చింది



మట్టి విగ్రహాలు పర్యావరణానికి ఎంతో ఉపయోగపడతాయన్న విషయాన్ని టీవీల్లో చూడడం, ఆ దిశగా తయారు చేసేలా ముందుకు వెళ్లాను. మంచి ఆదరణ వచ్చింది. గత మూడేళ్ల నుంచి మెదక్ కలెక్టర్ కార్యాలయానికి మట్టి విగ్రహాలను ఆర్డర్‌పై అందిస్తూ వస్తున్నాను. ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని కాపాడాలన్నదే నా కోరిక.

–కుమ్మరి శంకరయ్య, పైతర గ్రామం